క్లుప్తంగా

నేటి సర్వసభ్య సమావేశం వాయిదా

కరీంనగర్ కార్పొరేషన్: నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. ముందుగా నిర్ణయించిన ప్రకారం సమావేశం శనివారం నిర్వహించాల్సి ఉన్నా.. ప్రస్తుతం నగరంలోని 60 డివిజన్లలో ప్రజాపాలన కార్యక్రమాలు కొనసాగుతున్నందున వాయిదా నిర్ణయం తీసుకున్నారు. ప్రజాపాలన ముగిసే జనవరి 6వ తేదీ తరువాత సమావేశాన్ని నిర్వహించనున్నారు.

ఉదయసాహితి కార్యవర్గం ఎన్నిక

కరీంనగర్ కల్చరల్: సాహితీమిత్రుల సమావేశంలో ఉదయసాహితి సంస్థ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. 2024 నుంచి 2026 వరకు కార్యవర్గం కొనసాగుతుందని పేర్కొన్నారు. గౌరవాధ్యక్షుడిగా వైరాగ్యం ప్రభాకర్, అధ్యక్ష, కార్యదర్శులుగా ఎర్రం రాజారెడ్డి, రేండ్ల సంజీవ్ ఎన్నికయ్యారు. నేటి కవిత సమూహ అడ్మిన్ శ్రీదాస్యం లక్ష్మయ్య, గౌరవ సలహాదారు దాస్యం సేనాధిపతి, మేరుగు అనూరాధ, పద్మలత, దుగ్గరాజు లక్ష్మీ పద్మజ, బుక్కపట్నం రమాదేవి, మద్దెల సరోజన తదితరులు పాల్గొని కార్యవర్గాన్ని అభినందించారు.

జాతీయస్థాయి క్రికెట్ పోటీలకు అల్ఫోర్స్ విద్యార్థి


విక్రాంత్‌ను అభినందిస్తున్న డా.నరేందర్‌రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్): ఎస్‌జీఎఫ్ జాతీయ స్థాయి క్రికెట్ పోటీల అండర్–17 విభాగంలో రేకుర్తిలోని అల్ఫోర్స్ స్కూల్ ఆఫ్ జెన్‌నెక్స్ట్ విద్యార్థి విక్రాంత్ ఎంపికైనట్లు ఆ విద్యాసంస్థల చైర్మన్ డా.వి.నరేందర్‌రెడ్డి తెలిపారు. జోగులాంబ గద్వాల్ జిల్లాలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో విద్యార్థి అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా ఎంపికవ్వడమే కాకుండా జాతీయస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తుండటం సంతోషంగా ఉందన్నారు. శుక్రవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో విద్యార్థిని అభినందించారు.

ఢిల్లీ రిపబ్లిక్ పరేడ్‌కు సెయింట్ జార్జ్ విద్యార్థి


చరణ్‌ను అభినందిస్తున్న చైర్మన్ ఫాతిమారెడ్డి

కొత్తపల్లి: ఢిల్లీలో జరగబోయే జనవరి 26 వేడుకల్లో భాగంగా నిర్వహించే రిపబ్లిక్ పరేడ్–2024కు కొత్తపల్లిలోని సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ ఎన్‌సీసీ విద్యార్థి జె.చరణ్ ఎంపికైనట్లు స్కూల్ చైర్మన్ డా.పి.ఫాతిమారెడ్డి తెలిపారు. ఎన్‌సీసీ నిర్వహించిన ఏడు దశల శిక్షణలో ప్రతిభ కనబరిచి రిపబ్లిక్ పరేడ్‌కు ఎంపికవ్వడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థిని అభినందించారు.

కల్యాణలక్ష్మితో అండగా నిలిచిన కేసీఆర్


చెక్కు అందిస్తున్న మేయర్

కరీంనగర్ కార్పొరేషన్: కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలతో ఆడబిడ్డలకు మాజీ సీఎం కేసీఆర్ అండగా నిలిచారని నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. శుక్రవారం నగరంలోని 33వ డివిజన్ భగత్‌నగర్‌లో ఆయన గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో జారీ అయిన చెక్కులను ముగ్గురు లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఇంటి బిడ్డను తెలంగాణ ఆడబిడ్డగా భావించిన బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఈ పథకాలను ప్రవేశపెట్టారన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ ఆవిర్భావ దినోత్సవం


జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

కరీంనగర్: ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఎస్‌ఎఫ్‌ఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లావ్యాప్తంగా 8 సెంటర్లలో స్వాతంత్య్రం ప్రజాస్వామ్యం, సోషలిజం జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ పూజ, జిల్లా కార్యదర్శి గజ్జల శ్రీకాంత్, జిల్లా ఉపాధ్యక్షుడు రోహిత్, జిల్లా సహాయ కార్యదర్శి అసంపెల్లి వినయ్, నాయకులు ఓదెలు, సుధీర్, మనోజ్, అపర్ణ, సుల్తానా తదితరులు పాల్గొన్నారు.



స్వామి శరణం.. అయ్యప్ప శరణం..

కరీంనగర్‌రూరల్: చెర్లభూత్కూర్‌లో శుక్రవారం గురుస్వామి దాసరి నర్సింహారెడ్డి స్వగృహంలో అయ్యప్ప మహా పడిపూజను ఘనంగా నిర్వహించారు. గురుస్వాములు చంద్రమౌళిశర్మ, భాష్యం శ్రీనివాస్, హరిశర్మ, ఎం.ప్రకాశ్‌రెడ్డి, గర్షకుర్తి శ్రీనివాస్ ఆధ్వర్యంలో 18 మెట్ల పూజలో భాగంగా అయ్యప్ప స్వామికి పంచామృతాలతో అభిషేకం చేశారు. అనంతరం భక్తులకు భిక్ష పెట్టారు. సర్పంచ్ దబ్బెట రమణారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు బుర్ర తిరుపతిగౌడ్, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు బుర్ర నారాయణగౌడ్ తదితరులు అయ్యప్ప స్వామిని దర్శించి తీర్థప్రసాదాలను స్వీకరించారు.



రాములోరి తలంబ్రాలతో శోభాయాత్ర

కరీంనగర్‌రూరల్: ఎలబోతారంలో శుక్రవారం అయోధ్య రాములోరి తలంబ్రాలు, అక్షింతలతో శోభాయాత్ర వైభవంగా నిర్వహించారు. సీతారాముల విగ్రహాలను ట్రాక్టర్‌లో ఉంచి దప్పుచప్పుళ్లతో భక్తుల జైశ్రీరాం నినాదాలతో శోభాయాత్ర నిర్వహించిన అనంతరం హన్మాన్ దేవాలయంలో భద్రపరిచారు. వచ్చేనెల 1 నుంచి భక్తులకు తలంబ్రాలను పంపిణీ చేస్తామని ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధి సూర్యభాను తెలిపారు. బీజేపీ నాయకులు వేల్పుల శ్రీనివాస్, దారం జగన్నాథరెడ్డి, దేవేందర్, గోపాల్, రవి, భక్తజన మండలి సభ్యులు వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, వేణుమాధవ్‌రెడ్డి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల వెల్లువ



హౌసింగ్‌బోర్డు కాలనీలోని ప్రజాపాలన కేంద్రంలో దరఖాస్తుదారుల రద్దీ, 19వ డివిజన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి

- కిటకిటలాడిన సెంటర్లు
- నగరంలో రెండోరోజు 15,454 దరఖాస్తులు

కరీంనగర్ కార్పొరేషన్: గ్యారంటీ పథకాల అమలు కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపాలన కేంద్రాలు దరఖాస్తుదారుల తాకిడితో కిటకిటలాడుతున్నాయి. రెండోరోజు ప్రజల నుంచి దరఖాస్తులు వెల్లువెత్తాయి. నగరంలోని 60 డివిజన్లలో శుక్రవారం ఒక్కరోజే 15,454 దరఖాస్తులు వచ్చాయి. మొదటిరోజు 9,319 దరఖాస్తులు రావడం తెలిసిందే. శుక్రవారం 2, 7, 13, 15, 19, 21, 26, 34, 46, 49 డివిజన్లలో డివిజన్ సభలు నిర్వహించగా.. అన్ని డివిజన్లలో ఏర్పాటు చేసిన సెంటర్ల ద్వారా దరఖాస్తులు స్వీకరించారు. నగరవ్యాప్తంగా అన్ని కేంద్రాల్లో ఉదయం నుంచే సందడి నెలకొంది. సాయంత్రం 6 గంటల వరకు కూడా దరఖాస్తుదారులు ఆయా కేంద్రాల్లో ఉండడం కనిపించింది. కాగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, నగరపాలక సంస్థ కమిషనర్, ప్రత్యేకాధికారి బోనగిరి శ్రీనివాస్ ప్రజాపాలన కేంద్రాలను పర్యవేక్షిస్తూ దరఖాస్తుల ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. 33, 34 డివిజన్లలో మేయర్ యాదగిరి సునీల్‌రావు దరఖాస్తుల స్వీకరణను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. చాలా కేంద్రాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్పొరేటర్లతో సమానంగా దరఖాస్తుదారులకు అవగాహన కల్పించడం, దరఖాస్తులు తీసుకొని అధికారులకివ్వడం చేస్తూ హడావిడి చేశారు.

విశేష స్పందన

ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోందని కాంగ్రెస్ కమిటీ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. నగరంలోని 2, 19, 13, 34 డివిజన్లలో ప్రజాపాలన కేంద్రాలను సందర్శించి దరఖాస్తుల తీరును పరిశీలించారు. వికలాంగులు, వృద్ధులకు సంబంధించిన దరఖాస్తు ఫారాలను స్వయంగా పూరించి అధికారులకు అందించారు. మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్యారంటీ పథకాలతో పాటు రేషన్ కార్డుల కోసం కూడా దరఖాస్తులు ఎక్కువగా వస్తున్నాయన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఫ్లెక్సీ తొలగింపుపై ఫిర్యాదు

ప్రజాపాలన కార్యక్రమంపై నగరంలోని 30వ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని నగరపాలక సంస్థ శానిటేషన్ సిబ్బంది అక్రమంగా తొలగించారంటూ యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు అబ్దుల్ రెహమాన్, ఆమిర్ శుక్రవారం జిల్లా అదనపు కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఫ్లెక్సీని తొలగించిన జవాన్‌ను ప్రశ్నిస్తే.. దురుసుగా ప్రవర్తించాడని, చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆధ్యాత్మికం

మహా పడిపూజ పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న అర్చకుడు మంగళపెల్లి రాజేశ్వరశర్మ

కరీంనగర్‌కల్చరల్: అయ్యప్ప స్వామి జన్మ నక్షత్రాన్ని పురస్కరించుకొని హరిహరపుత్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో జనవరి 2న నిర్వహించే అయ్యప్ప 108 కన్నె స్వాములతో మహా పడిపూజ పోస్టరును శుక్రవారం శ్రీమంగళపెల్లి రాజేశ్వరశర్మ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాల్లో ఉత్సవ కమిటీ చైర్మన్ జీఎస్ నాగరాజు గురుస్వామి, బొల్లు నరేందర్ గురుస్వామి, పల్లె నారాయణగౌడ్ స్వామి, లింగంపల్లి సత్యనారాయణ గురుస్వామి, మంద వెంకన్న గురుస్వామి, గంగాధర్ గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

గోదాదేవికి ప్రత్యేక పూజలు

కరీంనగర్ కల్చరల్: ధనుర్మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం గోదాదేవికి పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వావిలాలపల్లి రామాలయంలో భక్తులు అమ్మవారికి సారె వస్తువులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మేచినేని వనజ, ఆలయ అధ్యక్షుడు మేచినేని అశోక్‌రావు, కమిటీ బాధ్యులు పాల్గొన్నారు. యజ్ఞవరాహ క్షేత్రంలో ఆండాళ్ అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్వీఎస్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ శ్రీభాష్యం వరప్రసాద్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మీసేవ కేంద్రాలు కిటకిట

- కులం, ఆదాయ సర్టిఫికెట్లకు దరఖాస్తులు
- సర్టిఫికెట్ల జిరాక్స్ కోసం పరుగులు


చెర్లభూత్కూర్‌లోని మీసేవ కేంద్రంలో దరఖాస్తుదారులు

కరీంనగర్‌రూరల్: జిల్లావ్యాప్తంగా మీసేవ కేంద్రాలు కిటకిటలాడుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలు కోసం ఈనెల 28 నుంచి ప్రజాపాలన గ్రామసభలను నిర్వహిస్తోంది. ఆయా పథకాలకు దరఖాస్తు చేసుకునేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో గ్రామసభలకు తరలివస్తున్నారు. దరఖాస్తు ఫారంతో జత చేయాల్సిన రేషన్ కార్డు, ఆధార్ కార్డు, ఇతర సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీల కోసం మీసేవ కేంద్రాలు, జిరాక్స్ సెంటర్లను లబ్ధిదారులు ఆశ్రయిస్తుండటంతో.. కొన్ని రోజుల నుంచి రద్దీగా ఉంటున్నాయి. అంతేకాకుండా వివిధ సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకునేందుకు అవసరమైన కులం, ఆదాయం సర్టిఫికెట్ల కోసం మీసేవ కేంద్రాల్లో పెద్దఎత్తున లబ్ధిదారులు దరఖాస్తు చేసుకుంటున్నారు. జిల్లావ్యాప్తంగా ఉన్న 215 మీసేవ కేంద్రాలు నాలుగైదు రోజుల నుంచి లబ్ధిదారులతో రద్దీగా ఉంటున్నాయి. తమ దరఖాస్తులను ముందుగా పంపించాలంటూ నిర్వాహకులతో వాగ్వాదానికి దిగుతున్నారు. ఇదే అదునుగా భావించిన కొందరు మీసేవ కేంద్రాల నిర్వాహకులు ఎక్కువ మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ప్రతి సర్టిఫికెట్‌కు రూ.45 నిర్ణీత రుసుం వసూలు చేయాల్సి ఉండగా.. నిర్వాహకులు రూ.60 నుంచి రూ.100 వరకు వసూలు చేస్తున్నట్లు బాధితులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరను మాత్రమే వసూలు చేయాలనే అధికారుల మాటలను నిర్వాహకులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి.

వద్దన్నా వినడం లేదు

ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణకు కులం, ఆదాయం సర్టిఫికెట్లు అవసరం లేదని అధికారులు పేర్కొంటున్నా.. ప్రజలు వినిపించుకోవడం లేదు. పలువురు లబ్ధిదారులు సర్టిఫికెట్లను ముందుగానే పొందడానికి మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేస్తున్నారు. గ్రామసభల్లో దరఖాస్తులు ఇచ్చేటపుడు సర్టిఫికెట్లను జత చేసి ఇస్తే ఓ పని పూర్తవుతుందని భావిస్తున్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు విచారణ చేసేటపుడు మాత్రమే సర్టిఫికెట్లను చూపించాల్సి ఉన్నా.. ముందుగానే తీసుకొని దరఖాస్తులతో ఇచ్చేస్తున్నారు. ఒకరిని చూసి మరొకరు మీసేవ కేంద్రాలకు పోయి సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేస్తున్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి ఆర్‌ఐతో సంతకం చేయించి మళ్లీ మీసేవ కేంద్రాల్లో ఇస్తున్నారు.

3,499 దరఖాస్తులు


చింతకుంటలో దరఖాస్తు స్వీకరిస్తున్న తహసీల్దార్ రాజేశ్

కొత్తపల్లి: ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణలో భాగంగా శుక్రవారం దరఖాస్తులు వెల్లువెత్తాయి. చింతకుంటలో 1,539, ఎలగందులలో 952 దరఖాస్తులు వచ్చాయి. ఆసిఫ్‌నగర్‌లో 9, బద్దిపల్లిలో 87 దరఖాస్తులు స్వీకరించినట్లు టీం లీడర్లు ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ ఎస్.రాజేశ్ తెలిపారు. ఇప్పటివరకు నాలుగు గ్రామాల్లో 3,499 దరఖాస్తులు స్వీకరించామన్నారు. ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ 6వ తేదీ వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు.

ప్రతి ఒక్కరి దరఖాస్తును స్వీకరించండి


కొత్తపల్లిలో దరఖాస్తులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్

కొత్తపల్లి(కరీంనగర్): ప్రజాపాలన గ్యారంటీ దరఖాస్తులను ప్రతి ఒక్కరివి స్వీకరించాలని జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) ప్రఫుల్ దేశాయ్ సూచించారు. కొత్తపల్లి పట్టణంలోని 2, 3 వార్డుల్లో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను శుక్రవారం సందర్శించి పరిశీలించారు. నమోదులో ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చూడాలన్నారు. రెండోరోజు 332 దరఖాస్తులు వచ్చినట్లు మున్సిపల్ కమిషనర్ కట్ల వేణుమాధవ్ తెలిపారు. మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, అధికారులు పాల్గొన్నారు.

అత్యధికులు రేషన్ కార్డు కోసమే..


చెర్లభూత్కూర్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న సర్పంచ్ రమణారెడ్డి

కరీంనగర్‌రూరల్: ప్రజాపాలన గ్రామసభలు శుక్రవారం చెర్లభూత్కూర్, నగునూరులో నిర్వహించారు. ప్రత్యేక కౌంటర్ల ద్వారా లబ్ధిదారుల నుంచి అధికారులు దరఖాస్తులను స్వీకరించారు. అత్యధికులు రేషన్ కార్డు కోసమే తెల్ల కాగితంపై దరఖాస్తులిచ్చారు. చెర్లభూత్కూర్‌లో 644, నగునూరులో 741 చొప్పున మొత్తం 1,385 దరఖాస్తులు వచ్చాయి. అర్హులైన లబ్ధిదారులు వచ్చేనెల 6 వరకు సంబంధిత గ్రామ పంచాయతీల్లో పథకాలకు దరఖాస్తులు సమర్పించాలని తహసీల్దార్ నవీన్‌కుమార్, ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు సూచించారు. సర్పంచులు ఉప్పుల శ్రీధర్, దబ్బెట రమణారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు బుర్ర తిరుపతిగౌడ్, వినయ్‌సాగర్, ఎంపీవో జగన్మోహన్‌రెడ్డి, పీఆర్ ఏఈ రమణారెడ్డి, కాంగ్రెస్ నాయకులు పెంచాల లక్ష్మణ్‌రావు, బత్తిని శ్రీనివాస్‌గౌడ్, విక్రం, శేఖర్, బుర్ర నారాయణ, నర్సింహారెడ్డి, రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

తెల్ల కాగితంపై..

పథకాల లబ్ధికి తెల్ల రేషన్ కార్డు ప్రాతిపదికని చెప్పడంతో కార్డు లేనివాళ్లు తెల్ల కాగితంపై దరఖాస్తు చేసుకునేందుకు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. పుట్టింటి వద్ద రేషన్ కార్డులో పేరు ఉండి వివాహమైన మహిళలకు అత్తింట్లో లేకపోవడంతో మహాలక్ష్మి పథకానికి ఎలా దరఖాస్తు చేసుకోవాలంటూ పలువురు మహిళలు అధికారులనడిగారు. రేషన్ కార్డు లేకున్నా సంబంధిత పథకాలకు దరఖాస్తులను తీసుకోవడంతోపాటు కార్డు కోసం వేరుగా తెల్ల కాగితంపై రాసిన వినతి పత్రాలను స్వీకరించారు. సంక్షేమ పథకాల దరఖాస్తులకు రశీదులిస్తున్న అధికారులు రేషన్ కార్డు వినతి పత్రాలకు మాత్రం ఎలాంటి రశీదును ఇవ్వడం లేదు. ప్రజల నుంచి వస్తున్న విజ్ఞప్తి మేరకు రేషన్ కార్డుల కోసం తెల్ల కాగితంపై దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు తహసీల్దార్ నవీన్‌కుమార్ తెలిపారు.

అయోమయం..

ప్రభుత్వం రూపొందించిన దరఖాస్తు ఫారం నింపే విషయంలో పలువురు మహిళలు కొంత అయోమయానికి గురయ్యారు. మహాలక్ష్మి పథకానికి దరఖాస్తులో కుటుంబంలో ఒకరి కంటే ఎక్కువ మంది మహిళలుంటే వారి పేర్లు ఒకే దరఖాస్తులో రాయాలా.. వేరే దరఖాస్తు ఇవ్వాలో తెలియక అయోమయానికి గురయ్యారు. ఒకటి కంటే ఎక్కువ పథకాలను ఒకే కుటుంబంలో పొందాల్సి ఉంటే ఎవరి ఫొటో అంటించాలనే విషయంలో సందిగ్ధత నెలకొంది. రైతు భరోసాలో కౌలు రైతులు దరఖాస్తు చేసుకున్నా.. భూయజమాని పట్టాపాసు పుస్తకం వివరాలను కొందరు ఇవ్వలేకపోయారు. గ్రామసభల్లో పాల్గొన్న అధికారులు సైతం లబ్ధిదారుల సందేహాలను కొంతవరకే నివృత్తి చేశారు. అయితే పలువురి దరఖాస్తులకు సంబంధిత వివరాలు, పత్రాలు జత చేయకపోయినప్పటికీ తీసుకున్నారు.

ఎన్నికలు నిర్వహించాలి


వినతి పత్రం సమర్పిస్తున్న నాయకులు

కరీంనగర్: జిల్లా ప్రాథమిక గొర్రెల పెంపకందారుల సహకార సంఘం యూనియన్ ఏర్పాటు చేయాలని కోరుతూ ప్రాథమిక గొర్రెల పెంపకందారుల సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి బి.నరేందర్‌కు వినతి పత్రం సమర్పించారు. యూనియన్ జిల్లా కార్యదర్శి కాల్వ సురేష్ మాట్లాడుతూ.. జిల్లావ్యాప్తంగా గొర్రెల పెంపకందారుల సహకార సంఘాలకు నవంబర్ 2022 నుంచి ఎన్నికలు నిర్వహిస్తున్నారన్నారు. ఇప్పటికీ 88 సంఘాలకు ఎన్నికలు పూర్తయ్యాయని, ఎన్నికల ప్రక్రియలో మరో 26 సంఘాలున్నాయని, అన్నింటినీ కలిపి జిల్లా సహకార యూనియన్ ఏర్పాటు చేయాలని కోరారు. 2019వ సంవత్సరం నుంచి జిల్లా సహకార యూనియన్ పాలకవర్గం ఎన్నికలు జరగలేదని, అప్పటి నుంచి ప్రత్యేక అధికారి పాలనలో కొనసాగుతోందని అన్నారు. గ్రామాల్లో సొసైటీ అధ్యక్షుల సాదకబాధకాలు పట్టింపు కరువైందన్నారు. వెంటనే జిల్లా యూనియన్ పాలకవర్గం ఎన్నికలు నిర్వహించి నూతన పాలకవర్గానికి యూనియన్ బాధ్యతలు అప్పగించాలని డిమాండ్ చేశారు. సహకార సంఘాల అధ్యక్షులు దాడి ఆంజనేయులు, చిగుళ్ల కొమురయ్య, పుట్ట కొమురయ్య, పంబాల లక్ష్మణ్, బనుక తిరుపతి, చిమ్మల్ల మహేశ్, చెన్నవేణి అనిల్, పాశం వేణు, బొమ్మెన పర్శరాములు, జినుక కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం జిల్లా ప్లీనరీ సమావేశాన్ని జయప్రదం చేయండి

కరీంనగర్: గత కార్యక్రమాలను సమీక్షించుకొని భవిష్యత్తు కర్తవ్యాలను నిర్దేశించుకునేందుకు శనివారం ముకుంద లాల్ మిశ్రాభవన్‌లో నిర్వహించే సీపీఎం జిల్లా ప్లీనరీ సమావేశానికి సీపీఐ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. దేశంలో, రాష్ట్రంలో పాలక ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలు, ప్రజలపై వాటి ప్రభావాలు, ప్రజానీకం ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్తు కర్తవ్యాలను రూపొందించడానికి ఈ ప్లీనరీ సమావేశం తోడ్పడుతుందన్నారు. రాష్ట్రంలో ఆరు గ్యారంటీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశానికి రాష్ట్ర నాయకులు హాజరవుతున్నారని పేర్కొన్నారు.